దీపావళి కథల పోటీలో రూ.200/–
కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# మమకారం

ధన్ దబ్.. దబ్.. రాళ్ల చప్పుడు. 'ఓరి మీ అమ్మ కడుపు కాల, ఒక్క పిందె దక్కనివ్వర్రా, వెధవల్లారా పోతారాపోరా... ఏది. కర్రేది. పిందె పడింది మొదలు దులిపితీసుకుపోతారు దిక్కుమాలినసంత—మధ్యాహ్నం కాస్త నడుం వాలిస్తే చాలు. ఏ మూల పొంచి వుంటారో ఈ గుంట వెధవల్లు' నట్టింట్లో గడపమీద తల పెట్టుకుని కొంగు వాల్చుకుని పడుకున్న పార్వతమ్మకి పడమటి గాలికి అప్పుడే చిన్న కునుకు పట్టింది. రాళ్ళ చప్పుడుకి మెలుకువ వచ్చి పిల్ల వెధవల్ని తిట్టుకుంటూ లేచి బయటికి వచ్చింది. పిట్టగోడెక్కి రాళ్ళతో, కర్రలతో మామిడికాయలు కొట్టుతూ, కింద పడినవి ఏరుకుంటూ పిల్లమూక పారిపోయారు పార్వతమ్మ కేకలకి. వాళ్ళు ఏరుకోగా మిగిలిన పిందెలన్నీ ఏరి కొంగున పోసుకుని లోపలికి నడిచింది ఆవిడ. "పిల్లాడికి నాలుగు పళ్ళు పెడదామంటే ఒక్క కాయా మిగిలిస్తేనా గుంట వెధవలు"

'ఏమిటే నీగోల నువ్వూనూ. ఆ కుర్ర వెధవలకి రోజూ ఇదే ఆట.... నీ గోల నీదేగాని వాళ్ళేం మానుతారా... నిద్ర పోనీయవు కాస్త' విసుక్కుంటూ లేచారు గౌరీపతిగారు.

మధ్యాహ్నం రెండున్నర.... ఏప్రిల్ నెల.అపుడే ఎండ నిప్పులు చెరుగుతోంది. ఆయన లేచి చన్నీళ్ళతో మొహం కడుక్కుని కుండలో నీళ్ళు ముంచుకు తాగి

"బాబిగాడు లేచాడే" అన్నారు.

"అప్పుడేనా... వెర్రినాగన్న ఎండన పడి వచ్చాడు" అనగానే కళ్ళు వాలిపోయాయి చంటి వెధవకి.

"లేపబోకండి, పడుకోనీయండి కాసేపు... ఏం ఎండలో అప్పుడే ఇలా మండిపోతున్నాయి.ఇంకా ఎండాకాలం అంతా ముందేవుంది" ఆవిడ వుస్సూరంటూ కొంగుతో మొహం తుడుచుకుని వత్తులబుట్ట ముందుకు లాక్కుంది.

"కాస్త ఇంత ఉప్పు, దబ్బాకువేసి మజ్జిగ తేటచేసి పెట్టకూడదే. మధ్యాహ్నం తాగచ్చు. ఎండలు ముదిరాయిగదా... ఇంక కాఫీ మానేసి మజ్జిగ తేట ఇస్తుండు మధ్యాహ్నం".

"అలాగేలెండి, రేపట్నించి అలాగే. ఆ దబ్బ చెట్టు తాటిచెట్టులా ఆకాశాన్నంటుకుంది. సాయంకాలం నాలుగు ఆకులు తెంపండి, నాకంది చావదు..."

"మామ్మా..."అంటూ వాళ్ల మాటలకి నిద్ర మెలకువ వచ్చి కళ్లిప్పాడు బాబిగాడు.

"అప్పుడే లేచావేం, కాసేపు పడుకోనాన్నా. యింకా ఎండగావుంది" మనవడి మంచందగ్గరకెళ్లి పక్కన కూర్చుంటూ అన్నారు గౌరీపతిగారు.

"తాతయ్యా.... రేపు నాకు మేథమెటిక్స్ టెస్ట్ తాతయ్యా.... బోలెడు లెక్కలు చెయ్యాలి... తాతయ్యా నాకన్నీ ఒక్కసారి చెప్పవూ...." బెంగగా అన్నాడు. ఏడేళ్ళ పిల్లాడి కళ్లల్లో పరీక్షలంటే ఆదుర్దా, బెదురు చూసి "పిచ్చికన్న! పరీక్షలని నా తండ్రి ఎంత బెంగెట్టుకున్నాడో పాపం. నీకేంరా క్లాసులో నువ్వేగా ఫస్టు... తాతగారన్నీ చెప్పేస్తారు కదరా..." మనవడిని మురిపెంగా చూస్తూ అంది పార్వతమ్మ.

"అట్లాగేలే... దబ్బున లేచి చన్నీళ్ళతో మొహం కడిగేసుకుని పలకా బలపం పట్టుకురా. అన్ని సమ్స్ ఓసారి చకచక చేసేద్దాం" తాతగారు అనగానే నిద్ర మత్తు ఎగిరి చెంగున దుమికి పెరట్లోకి పరిగెత్తాడు రవిప్రసాద్. మనవడికి గ్లాసునిండా పాలు, భర్తకు కాఫీ ఇచ్చి తాత,మనవడు లెక్కలు చేసుకుంటూంటే.. తాను వత్తులు చేసుకుంటూ తాతగారి ప్రశ్నలకు తెలివిగా, చురుకుగా జవాబు ఇచ్చే మనవడిని చూసుకుని మురిసిపోయింది నాయనమ్మ! ఆ మనవడే వాళ్ళ జీవితానికి వెలుగు! జీవాధారం. బతుకులో రక్తి, ముక్తి అన్నీ ఆ పసికందే వాళ్ళకి!

ఏడేళ్ళ క్రితం—ముగ్గురు ఆడపిల్లలు, కన్నిప్పకుండానే ఇద్దరు, పుట్టకుండానే ఒకరు పోయాక, నోములు, వ్రతాలు, ముడుపులు కట్టాక పుట్టిన ఒక్కగానొక్క కొడుకు రవి. పాతికేళ్ళు నిండకుండానే మృత్యువు స్కూటర్ ఏక్సిడెంట్ రూపంలో పొట్టన పెట్టుకుంటే, ఇరవైఏళ్ళ కోడలు కాలిపారాణి ఆరకముందే విధవ అయితే... ఆ దుఃఖం రంపపు కోత ఎలాంటిదీ ఎరిగిన అందరూ వాళ్ళ దుస్థితికి కన్నీరు పెట్టారు. అల్లారు ముద్దుగా పెంచుకుని తెలివిగా చదువుకునే కొడుక్కి ఇంజనీరింగ్ చెప్పించి, ఉద్యోగం రాగానే చక్కని చుక్కని తెచ్చి పెళ్లిచేసి కొడుకుని వదిలి వుండలేక వూరు వదిలి కొడుకుతోపాటు చేరి హాయిగా కృష్ణా రామా అనుకునే వయస్సు వచ్చింది, కొడుకు నీడన మనవలతో ఆడుకుంటూ గడపొచ్చు అని సంతృప్తిగా రోజులు వెళ్ళదీస్తుంటే.... ఆ సంతోషం నాల్గు రోజులవకముందే కొడుక్కి మృత్యువు తోసుకొచ్చి వాళ్ళ కలలని, ఆశలని సమూలంగా నాశనం చేసింది. కొత్త అల్లుడికి సంక్రాంతికి స్కూటరు బహుమతిగా ఇచ్చిన ఆ మామగారు ఆ స్కూటరే కుమార్తె పసుపు కుంకుమని తుడిచేస్తుందని అనుకుంటే ఆ బహుమతి ఇచ్చేవాడు కాదేమో కొత్తజంట ఆ స్కూటరెక్కి షికార్లు తిరక్కుండానే ఆఫీసునించి వస్తూంటే లారీ వెనక నించి గుద్దితే, కళ్ళిప్పకుండానే కన్నుమూసిన

డి. కామేశ్వరి

**నిజాన్ని నిర్దయంగా సమాధిచేసేసి అసత్యంతో ఓ పసి హృదయానికి అందంగా అడ్డుగోడ కట్టాలనుకునే ఓ వృద్ధ దంపతుల ఆరాట ఫలితం???**

కొడుకుని చూసి... ఆరోజే కాదు, ఈ రోజూ వణికిపోతారు అది గుర్తువస్తే! ఆ బాధ ఎలా తట్టుకున్నారో ..... ఎవరి కోసం, ఇంకా ఎందుకు బతకాలో అర్థంకాని అయోమయ స్థితిలో పదిరోజులు పూర్తిఅయ్యాయి!

వియ్యాలవారు కర్మకాగానే పిల్లని తీసికెళ్ళిపోతామని తేల్చి చెప్పారు! ఏ మొహం పెట్టుకుని ఉంచమని అడగగలరు. ఆ పిల్లకి ఇక్కడేం మిగిలిందని, ముక్కుపచ్చలారని ఆ పిల్లకి బోలెడు భవిష్యత్తుందని ఎరగరా తాము. పిల్లని చదివిస్తాం, ఉద్యోగం చేయిస్తాం, దాని అదృష్టం బాగుంటే ఏ సహృదయుడో దొరికితే రెండోపెళ్ళి చేస్తాం అన్నది కూడా అంత దుఃఖంలోనూ అప్పుడే తేల్చి చెప్పేశారు. కన్నబిడ్డ భవిష్యత్తుగురించి ఆరాటపడే ఆ తల్లిదండ్రులని ఎలా తప్పు పట్టగలరు. తమ కొడుకు నిర్భాగ్యుడు. అనుభవించేవయసులో ఏ అనుభవము లేకుండానే వెళ్ళిపోయాడు. ఆ పిల్లనైనా సుఖపడనీ! మళ్ళీ మూటా ముల్లె కట్టుకుని తమ వూరు చేరాలి! చావలేక జీవచ్ఛవాల్లాగా మిగిలిన బతుకీడ్వాలి! భగవంతుడా ఏం పాపం చేశామని మాకే శిక్ష అని కంటికి మింటికి ఏకధారగా ఏడ్చారు. భగవంతుడు మీ దుఃఖం చూడలేక వరం ఇస్తున్నాను, మీరు పోగొట్టుకున్నది భర్తీ చేయడానికిది నా వరం అన్నట్టుగా రెండున్నర నెలలు కాపురం చేసిన కోడలు, కొడుకు పోయిన పదకొండోరోజు భళ్ళున వాంతి చేసుకుని మొహం తిరిగి పడిపోయింది. డాక్టరు వచ్చారు. అనుమానం చెప్పారు. పరీక్షలు చేయించారు! కోడలు నెల తప్పిందన్న వార్త తెలియగానే వాళ్ళ కళ్ళల్లో మెరుపులు! గుండెల్లో ఉరుములు! భగవంతుడా నీ లీలలు ఎంత విచిత్రం. మనసులోనే వెయ్యి నమస్కారాలు పెట్టుకున్నారు. ఆ సంతోషం అరగంట నిలవనీయకుండానే వియ్యపురాలు, వియ్యంకుడు గుసగుసలాడుకుంటున్న మాటలు పార్వతమ్మవింది. "ఎంత ఘోరం! ఎంత పాపం! ఎంత అన్యాయం! తమ కొడుక్కి ప్రతిరూపం, తమ వంశాంకురాన్ని తమ కూతురు భవిష్యత్తుకు అడ్డు అని ఆ అడ్డు తొలగించుకోవాలనుకుంటున్నారా" వణికిపోతూ భర్తచెవిని ఈ వార్త వేసింది పార్వతమ్మ. ఆయన నిర్ఘాంతపోయారు

... వీల్లేదు. తమ కొడుకు ప్రతిరూపాన్ని తాము వదులుకోము! ఇంత పాపానికి ఒడికట్టనీయరు. తరువాత ఇద్దరూ వియ్యాలవారి చేతులే కాళ్ళనుకున్నట్టు పట్టుకున్నారు. దీనాతిదీనంగా బతకడానికి దొరికిన ఈ చిన్న ఆశని సమూలంగా మొగ్గలోనే తుంచేయవద్దని, కొడుకు గుర్తుగా మిగలనీయమని అర్థించారు. మూడునాళ్ళ ముచ్చటైన కాపురం, ముక్కుపచ్చలారని తమ కూతుర్ని ఈ రూపంలో బంధిస్తే దాని భవిష్యత్తు ఏమిటి, దానికెందుకీ బంధం అని వేధించారు వియ్యాలవారు. దాని బతుకు నాశనం కాకుండానే ఈ ఏర్పాటు అని వాదించారు. జవాబు చెప్పాల్సిన కోడలు ... జరుగుతున్నదేదీ అర్థంకానట్లు నిర్లిప్తంగా వుండిపోయింది. "మీ అమ్మాయిని ఒక్క తొమ్మిది నెలలు ఆ బరువు మోయమనండి. మిగతా బరువంతా మేం జీవితాంతం మోస్తాం. తాళి కట్టించుకుని, మూడు నెలలు మా కొడుకుతో కాపురంచేసిన కోడల్నించి ఇంకేం ఆశించం, ఈ బిడ్డ ఆమె బిడ్డ అని కూడా తెలియనివ్వం ఎవరికీ! ఈ ఒక్క ఉపకారం చేసి మా వంశాంకురాన్ని మాకివ్వండి" అని భోరున ఏడ్చారు ఇద్దరు. రకరకాల తర్జన భర్జనలు జరిగాక ఆఖరికి బిడ్డపుట్టగానే ఆ బిడ్డని వారికప్పగించి చేతులు దులుపుకునే షరతుమీద అంగీకరించి కూతుర్ని తీసుకుని వెళ్ళిపోయారు వియ్యాలవారు. ఆ తొమ్మిదినెలలు ప్రతిరోజూ ప్రతి క్షణం లెక్కబెట్టుకుంటూ గడిపారు. డాక్టర్ చెప్పిన తారీఖుకి వియ్యాలవారు ఏర్పాటుచేసిన ఊరి నర్సింగ్ హోమ్‌కి చేరుకున్నారు. కన్నతల్లి కళ్ళిప్పి బిడ్డను చూసుకోకుండానే పార్వతమ్మ చేతిలో పెట్టిపంపించారు ఆ తల్లిదండ్రులు. ఆ తల్లి మనసేమిటో వాళ్ళకి తెలియదు. ఆ తల్లి తరఫున ఆ తల్లిదండ్రులు వకాల్తా పుచ్చుకుని కూతురి భారం దించివేశారు.

ఆ క్షణంనించి వాళ్ళిద్దరికి కంటిపాపయి పోయాడు రవిప్రసాద్. "మన రవి పోతూపోతూ మనకిచ్చిన ప్రసాదం అండీ వీడు. భగవంతుడిచ్చిన ప్రసాదం మనకు. రవిప్రసాద్ అందామండీ" అంది పొత్తిళ్ళలో మనవడిని చూసుకుని మురిసిపోతూ. రైల్లోనే నామకరణం చేసి "మన రవి మళ్ళీ పుట్టాడండీ" అని ఆ కళ్ళిప్పని పసికందుని ఒకర్నించి ఒకరు అందుకుంటూ మురిసిపోయారు.

గత ఏడు సంవత్సరాలనించి ప్రతిక్షణం మనవడి కోసమే బతికారు. ఆ పసివాడితోనే వాళ్ళ జీవితం అయిపోయింది. ఆపురిటి పసికందుని తీసుకొచ్చింది మొదలు ఇద్దరికీ క్షణం తీరిక లేనట్టు అయిపోయారు. ఆ పసిపాపను చూసుకుంటూ ఇద్దరు పసిపిల్లల్లా సంబరపడిపోయేవారు. ఆవిడ కాలిమీద పడుకోబెట్టుకుని నీళ్ళు పోస్తుంటే ఆయన పైనుంచి నీళ్ళు పోసేవారు. ఆవిడ వళ్ళు తుడుస్తుంటే ఆయన కుంపటి తెచ్చి సాంబ్రాణిపొగ వేసేవారు. ఆయన పౌడరు అద్దుతుంటే ఆవిడ బొట్టు నుదుట పెట్టేది. ఆయన పాలసీసా కడిగి తీస్తే ఆవిడ పాలు కలిపి పట్టేది. ఆ పసివాడు పాలు అబగా తాగుతుంటే కన్నకి ఎంత ఆకలో చంటిముండ ఎలా తాగుతున్నదో" అనుకుంటూ చూసేవారు. వాడు ఉచ్చ పోసిన గుడ్డలు ఆవిడ మారుస్తుంటే ఆయన ఆ గుడ్డలు ఎండలో ఎండేసి వచ్చేవారు. వాడిని పడుకోబెట్టి ఆవిడ వంట చేస్తుంటే, ఉయ్యాల దగ్గర కూర్చుని ఆయన పేపరు చదువుకునేవారు తాడు లాగుతూ. వాడు కొంచెం కదిపితే చాలు 'బాబు ఏడుస్తున్నాడే' అని కేక పెట్టేవారు. ఆవిడ వంట చేసినంత సేపు ఆయన వంతు చూపడం ఆయనకి అన్నం పెట్టి ఆయన తిన్నంత సేపు మనవడిదగ్గర కూర్చుని, ఆయన తిని వచ్చాక తనుతినేది. పిల్లాడు ఎక్కడ లేస్తాడోనని రాత్రిళ్లయితే వేరే పడుకోబెడితే, వాడు లేచి ఏడిస్తే వినపడక పోతేనో అనుకుని ఇద్దరి మధ్య పడుకోబెట్టడానికి పడుకునేవారు మంచాలు అయితే కుదరని డబుల్‌కాట్ బల్లల మంచాలు చేయించుకుని మనవడిని మధ్యపడుకోబెట్టుకునేవారు. వాడు కదిలితే చాలు. ఇద్దరికీ ఎవరో ఒకళ్ళు వచ్చి కూర్చునేవాళ్ళు. రెండోనెల నుండి నవ్వులు మొదలు పెట్టగానే ఇద్దరు చిన్నపిల్లల్లా 'చూడవే ఎలా నవ్వుతున్నాడో' —'చూడండీ నన్ను చూసి నవ్వుతున్నాడండీ' అంటూ సంబరపడిపోయేవారు. వాడు బోర్లాపడితే పెద్ద వింత, నోట్లో వేలేసుకుంటే ఆశ్చర్యం, వాడు పాకితే మురిపం, నవ్వితే సంబరం, గుప్పెట బిగించి జుట్టు పట్టుకు పీకితే పరవశం, ముక్కు పట్టుకు లాగితే ఆనందం..... ఊ.... ఆ..... అంటూ కబుర్లు చెబితే సంబరం... లేచి కూర్చోడానికి వాడుపడే పరమాశ్చర్యం. తాతని, మామ్మని గుర్తుపట్టి బోసినోటితో నవ్వితే ఏనుగెక్కినంత సంబరం. వాడు నడిచినరోజు ఆ సంబరం పదేపదే చెప్పుకుంటూ వాడు 'తాత' అన్న రోజు ఆయన కళ్ళల్లో నీళ్ళు. వాడు తడబడుతూ అడుగు వేసిన నాడు పెద్ద ఘనకార్యం సాధించినంత గర్వం. వాడి అన్నప్రాసననాడు పుస్తకం ముట్టుకుంటే 'నా మనుమడు' అని ఆయన సంబరం. మామ్మ వంట చేసుకుంటుంటే వంటింట్లోకి గునగన నడుచుకుంటూ కొంగు పట్టుకు లాగితే మైలపడ్డానని కూడా గుర్తు రానట్టు ఆవిడ 'నా తండ్రీ, నా బాబే నన్ను

వెతుక్కుంటూ వచ్చావా' అని మురిసి పోవడం... ఎన్నని చెప్పడం. వాడి ప్రతిచేష్ట, ప్రతినవ్వు, ప్రతి మాట అనుక్షణం వాళ్ళ జీవితాల్లో నిండిపోయింది. వాడి వళ్ళు వెచ్చబడితేచాలు డాక్టరు. రెండు పూటల పాలు తాగకపోతే ఇద్దరు దిగులు పడి పోవడం, రెండు విరోచనాలు అయితేగాబరా, కాస్తజలుబుచేస్తే బెంగ.. ప్రతి క్షణం కళ్ళల్లో వత్తులు వేసుకున్నట్లే వాణ్ణి పెంచుకొచ్చారు. ఆ పసివాడి పెంపకంలో వాళ్ళు పొందిన ఆనందం మాటలకందని అనుభూతి "ఏమండీ, మన రవికంటే మనం వీడినే ఎక్కువ ప్రేమిస్తున్నాం ఏమిటండీ, కడుపున పుట్టిన బిడ్డకంటే మనవడే ఎక్కువగా కనపడ్తున్నాడేవిటండీ...." మనవడిని ముద్దులాడుతూ ఒకరోజు అంది పార్వతమ్మ.

"ఔనే! వీడు మనవడే! అసలుకంటే వడ్డీయే ముద్దే... మనవారసుడే వీడు. మన ఇంటి దీపమే......"

"అబ్బో అబ్బో ఏం ప్రేమ. రవి చిన్నప్పుడు ఉచ్చ పోసినా, అబ్బబ్బ బట్టలు తడిపేసేడు అని విసుక్కునేవారు. ఇప్పుడు వాడి ఉచ్చ మీకు పంచామృతంలా వుంది. దొడ్డికెళ్ళినా అసహ్యం లేకుండా తుడిచేస్తున్నారు. మనవడంటే అన్ని అసహ్యాలూ పోతాయి. ఏమిటో"

"నిజమేనే. వీడేం చేసినా అసహ్యం వేయడం లేదు. ఉచ్చలు పోసినా, పంచెకూడా మార్చడం లేదు. వీడింత ప్రాణం అయిపోయాడే మనకు"

"నాకూ ఆశ్చర్యంగానే ఉంది సుమండీ! మన కడుపున పుట్టిన బిడ్డకంటే వీణ్ని మనం ఇంతఎక్కువ ప్రేమించడం..."

"కారణం చెప్పమంటావా. మన పిల్లల టైంలో మనకి బరువు బాధ్యతలు ఉండేవయసు. ఇంకా ఉడుకు రక్తం ఉండేవయసు. పిల్లలను పెంచడం ఒక్కటే పరమావధి కాదు అనిపించే వయసు అది. ఇప్పుడేముంది జవసత్వాలుడిగి బాధ్యతలు తీరిన ఈ వయసులో మనవలతో మసలడం ఒక్కటేగదా తాత, నాయనమ్మలకి మిగులుతుంది. వయసు తెచ్చే మెచ్యూరిటీ, అదే పరిపక్వత వల్ల సహనం, శాంతం, ఓర్పు అన్ని వేళలా పిల్లలు ఏడ్చినా, అల్లరిచేసినా భరించే ఓర్పు వస్తుంది. పిల్లల టైమ్‌లో విసుక్కునే తల్లిదండ్రులు మనవల వేళకి వచ్చేసరికి నెత్తినెక్కించుకుంటారు. అంటే వయసు తెచ్చిన మార్పు—అందులో మనవిషయంలో అయితే ఇంకా జీవితంలో మనకేం మిగిలింది! ఏ ఆశయినా, కోరికైనా, మమతైనా వీడే! అంచేత వీడు తప్ప మనకి మరో ప్రపంచంకూడా లేదు" ఆయన విడమర్చి చెప్పారు.

"నిజమే, లేకపోయివుంటే మన బతుకు నిస్సారంగా వుండేది!" ఆవిడ గొంతుశుద్ధమవగా మనవడిని గుండెలకద్దుకుంది.

రవిని పెంచుకుంటూ వాడు అడిగింది లేదనకుండా, అడక్కుండానే అన్నీ అమరుస్తూ.. ఒక్కోమెట్టు చెయ్యి పట్టు ఎక్కిస్తున్న వాళ్లిద్దరూ వాడి పెంపకంలో ఏనాడు ఏ ఇబ్బంది ఎదుర్కోలేదు. ఒకేఒక్కసారి మాత్రం వాడు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పడానికి తడుముకోవాల్సి వచ్చింది. రవి ఆరేళ్ళవాడైనప్పుడు ఒకరోజు స్కూలునుండి వచ్చి "తాతగారూ! నాకు మమ్మి ఎందుకు లేరు" అని అడగ్గానే పక్కలో బాంబు పడ్డట్లు అదిరి పోయారు ఇద్దరూ. ఇద్దరు మొహాలు చూసుకుంటూ ఉండిపోయారు.

"మామ్మా! మా క్లాసులో అందరికి మమ్మీ, డాడీలు వున్నారు కదా! మరి నాకెందుకు లేర్రు తాతయ్యా? మమ్మీ, డాడీ అంటే ఏమిటి తాతయ్యా! మనవడు అడుగుతుంటే ఆ పసివాడి ప్రశ్నకు జవాబు ఇవ్వడానికి తడుముకున్నారు.


"ఎందుకురా కన్నా అలా అడుగుతున్నావు. మమ్మీ, డాడి ఇవన్నీ నీకెలా తెలిశాయిరా బాబీ..." తాతగారు మనవడిని దగ్గరికి లాక్కున్నాడు.

"మరేం.. సునీల్ లేడూ...! అస్తమానం మా డాడీ, మా మమ్మీ అంటూంటాడే! మమ్మీ, డాడీ అంటే ఎవరురా అంటే మమ్మీ, డాడి అంటే తెలియదూ అని నవ్వాడు. అన్నం పెట్టి నీళ్ళుపోసి బట్టలు తొడిగి అన్నం చేసేది మమ్మీ. ఆఫీసు కెళ్ళి డబ్బులు తెచ్చేది డాడి అని చెప్పాడు అప్పుడు నేనేమో ఫో, అన్నం పెట్టేది మామ్మ, స్కూలుకి తీసికొచ్చేది తాతయ్య అని చెప్పాను. వాడేమో అపుడు నీకు మమ్మీ డాడీలు లేరు కనక మీ మామ్మ, తాతయ్య చేస్తున్నారు. అందరికీ మమ్మీ, డాడీలే చేస్తారు అన్నాడు తాతయ్యా! అందరూ అలాగే అన్నారు అందరికీ వుండి నాకు ఎందుకు లేరు తాతయ్యా?" పెద్ద పెద్ద కళ్ళు తిప్పుతూ అనుమానంగా అడిగిన ఆ ప్రశ్నకు గుండె నీరైంది. పార్వతమ్మ కళ్ళల్లో నీరు తిరిగింది. "నా కన్న తండ్రి, నీ పసిమనసుని ఎవరురా ఇలా తూట్లు పొడిచింది.... నీకు మేమున్నాం నాన్న అనుకున్నారు మనసులో. ఆ పసివాడికి నీ డాడి చచ్చిపోయాడు. నీ మమ్మీ కని వెళ్ళిపోయింది అని చెప్పడం, చెప్పి ఆ పసిమనసును నొప్పించడమా!...."

"ఆ సునిల్‌కి ఏం తెలీదురా కన్నా! నీకు మమ్మీ డాడిలు లేకపోవడం ఏమిటీ! నీ డాడీ, మమ్మీలు ఫారన్‌లో ఉన్నారు. ఫారన్ అంటే ఏమిటో తెలుసా... అమెరికా..అబ్బో ఇక్కడ్నుంచి ఎంతదూరమనుకున్నావు. విమానంలో అలా గంటలు గంటలు వెళ్లాలి. అక్కడ మీ డాడీకి పెద్ద ఉద్యోగం, పెద్ద ఇల్లు, ఇంత పెద్ద కారు, అన్నీ వున్నాయి. నీకు మమ్మీ, డాడీలు లేరని ఎవరన్నా అంటే అలా చెప్పు." మనవడిని తృప్తిపరచడానికి ఆ పసివాడి మనసు గాయపడకుండా ఉండడానికి చిన్న అబద్ధం ఆడటానికి కూడా జంకలేదు గౌరీపతిగారు.

"మరి మమ్మీ డాడి ఉంటే నన్నెందుకు ఇక్కడ వదిలేశారు. నన్నెందుకు తీసికెళ్ళ లేదు అక్కడికి." సందేహంగా అడిగాడు. ఈ సారి జవాబుకి కాస్త తడుముకున్నారుఆయన.

"నీవు పుట్టినపుడు ఇంత చిన్నవాడివిగదా. నిన్నక్కడకు తీసికెళితే అక్కడ మనదేశంలో మాదిరి పని వాళ్ళుండరు. అన్ని పనులు మీ మమ్మీయే చూసుకోవాలి. ఇంత చంటివాడిని తీసికెళితే మీ మమ్మీకి కష్ట




మవుతుంది. పెద్దయ్యాక తీసికెడతాం. అని వదిలేసి వెళ్ళారు." మరో అబద్ధం సునాయాసంగా ఆడేశారు.

"మరి నేనిప్పుడు ఇంత పెద్దయినా తీసికెళ్ళ లేదేం?" మరో సందేహం....

"మరి.. మరి.... మీ అమ్మ అక్కడ ఆఫీసుకెళ్ళి ఉద్యోగం చేస్తుంది కదరా... ఇంట్లో నీవొక్కడివి ఉండాలి అని ఇక్కడ నాయనమ్మ తాతయ్య ఉన్నారు కదా, మాకు కాలక్షేపం అవుతుందిఅని వుంచేశారు రా బాబీ..." ఆ జవాబు ఆ పసివాడికి నచ్చినట్లు లేదు. మొహం కాస్త అప్రసన్నంగాపెట్టి "అయితే నేనెప్పుడూ ఇక్కడే వుండి పోవాలా, మమ్మీ, డాడి అసలు తీసికెళ్ళరా నన్ను...." ఆ పసివాడి మనసులో నిండిన అసంతృప్తి ఆ కళ్లల్లో ప్రతిఫలించిన నిరాశ, తాతగారి మనసుని కలచి వేసింది.

"ఎందుకుండి పోతావురా! నీవు ఇంకాస్త పెద్దవాడివయ్యాక ఓ రోజు మమ్మీ, డాడి వచ్చి తీసికెళ్లిపోతారు. ఇంత పెద్ద కారులో వస్తారు. బోలెడు బొ



మ్మలు, పుస్తకాలు, బట్టలు నీకోసం తెస్తారు తెలుసా?... ఆ కళ్లల్లో మెరుపు, సంతోషం చూసి వాడి ఆనందం కోసం ఎన్ని అబద్ధాలైనా చెప్పడానికి ఆయన సిద్ధ పడ్డారు.

"నిజంగానా తాతయ్యా...." సిగ్గు సిగ్గుగా అడిగాడు మళ్లీ ఏదో జ్ఞాపకం వచ్చి

"తాతయ్యా... మా మమ్మీ, డాడీ ఎలా వుంటారు, నేనెప్పుడూ చూడలేదు... చూపించరా తాతయ్య ఒకసారి, ఫోటోవుంటే చూపించవూ..." ఆరేళ్ళ పసివాడికి ఎన్నితెలుసు. స్కూల్ పిల్లలు ఎన్ని విషయాలు మాట్లాడుకుంటారో.. పార్వతమ్మ, గౌరిపతిగారు మొహాలు చూసుకున్నారు. పిల్లాడు కోరిన కోరిక కాదనలేక పెట్టె అడుగున దాచివుంచిన పెళ్ళి ఫోటో తీసి చూపించారు. అలా ఆల్బం చూసుకుంటూ మురిసిపోతున్న మనవడిని చూసిచూసి "ఏరా బాబీ, తాతయ్యని, నాయనమ్మని అప్పుడే మర్చిపోయావా! మీ మమ్మీడాడి ఫోటోలు చూసే మమ్మల్ని మర్చిపోయావూ! రేపు మీ మమ్మీ, డాడీ వస్తే మమ్మల్ని మర్చిపోతావా" హాస్యంగా అన్న మాటలవెనక వారి మనసులో చిన్న నీడలాంటి అనూయ.

"ఎంత చేస్తే మాఅమ్మవవుతావు" అన్నసామెతలో ఎంత నిజం వుంది. వాళ్ళు చూడని తల్లిదండ్రుల మీద ఎంత అభిమానం, ఆసక్తి ఆ పసివాడికి. రవి జవాబివ్వకుండా ఫోటోలు చూడటంలో మునిగి పోయాడు.

"ఏరా బాబి... నీకిక్కడ బాగా లేదురా. మమ్మీ, తాతయ్య దగ్గర నీకుండడం ఇష్టం కదురా. నిన్నింత ముద్దు చేస్తున్నాం గదా! అమ్మ, డాడి ఎందుకురా మేముండగా" పార్వతమ్మ మనవడేం అంటాడోనన్నట్టు అంది.



డి.కామేశ్వరి.

రవి ఇద్దరి ముఖాలు మార్చి చూశాడు. వాళ్లిద్దరి మొహాల్లో ఆరాటం చూసి 'బాగానే వుంది కాని... కానీ, మా ఫ్రెండ్స్ అంతా మమ్మీ దగ్గర వున్నారు గదా.. నేను ఒక్కడినే ఇలా ఎందుకుండాలి అని...' సంజాయిషీ ఇస్తున్నాడు.

"మీ మమ్మీ డాడి వచ్చారనుకో, మమ్మల్ని వదిలి వెళ్ళిపోతావురా బాబీ"

"మరి వెళ్లొద్దాతాతయ్యా... మమ్మీ డాడీల దగ్గరే గదా వుండాలి అందరిలాగా..?" లా పాయింటు వేశాడు. ఆ పసివాడి మనసులో ఆలోచనలకి విస్తుపోయారు ఇద్దరూ.

"మీరెందుకండి అలా చెప్తారు. ఇంక రేపట్నించి మా అమ్మానాన్న ఎప్పుడొస్తారు ఎప్పుడొస్తారు అంటూ అడుగుతుంటాడేమో పిచ్చినాగన్న" మనవడు ఆడుకోడానికి వెళ్ళిపోయాక పార్వతమ్మ భర్తని అడిగింది.

"మరేం చెప్పమంటావే ఆ చంటి వెధవకి. మీ నాన్న చచ్చిపోయాడు, మీ అమ్మ నీ మొహం కూడా చూడకుండానే మా చేతుల్లో పారేసిందని చెప్పమంటావా.. నిజం చెప్పి ఆ పసి మనసుని బాధ పెట్టడం కంటే వాడ్ని ఆ అబద్ధంలోనే ఆనందాన్ని పొందనీయు

అని అలా చెప్పాను.''

''వె(రినాగన్నా.. అందరికి అమ్మ నాన్న వున్నార ని తనకి లేరని పాపం ఎంత బాధ అన్పించిందీ పిల్లలం తా అలా అంటే.'' ఆవిడ కళ్ళు తడుచుకుంది కొడుకు గుర్తుకు వచ్చి.

''కొంత వాడికి జ్ఞానం వచ్చాక ఓరోజు నెమ్మదిగా చెప్పచ్చు 'మీ అమ్మా, నాన్నా అమెరికాలో లేరు. ఏక్సిడెంట్‌లో పోయారని, మరో అబద్దం చెప్పి నమ్మించుదాం.''

''ఏమిటో ఒకోసారి అన్పిస్తుంది చంటివెధవ వా డికాళ్ళమీద వాడు నిలబడే వరకన్నా మనం బతికి వుంటామా.. మనకు వయసు మీరింది. అరవై ఐదు మీకు, అరవై నాకు వస్తున్నాయి. వీడింకా పసికందు. రేపు మనకేదన్నా అయితే వీడి కెవరు దిక్కు అన్నది తల్చుకుంటే నా గుండె నీరవుతుంది. ఆ భగవంతుడ్ని రోజూ అదే (పార్థిస్తుంటాను. వీడ్ని దిక్కు లేని వాడిని చేయొద్దని.''

''నీకూ అలాగే అన్పించిందీ..రా(తిళ్ళు ఒకోసారి ఈ ఆలోచన వస్తే నాకు ని(ద పట్టడం లేదు.మన కేద న్నా అయితే వాడి కేం ఏర్పాటు చేయాలా అన్న ఆలోచ నతో సతమతమవుతున్నాం.'' అన్నారు గొంతు రు ద్ధమవుతుండగా—

అన్నింటికీ నేనున్నాను, మీ సమస్యలు తీర్చడమే నా కర్త వ్యం, వారు పోశాను, నీరూ పోస్తాను అని ఆ భగవంతు డే అన్నట్లుగా ఓ నెల తరువాత పరీక్షలయి స్కూలుకి శలవు వచ్చాక ఉదయం పదిగంటలవేళ వీధిలో తోటి పిల్లలతో ఆడుకుంటున్న బాబిగాడు పగరుస్తూ లోపలి కి పరిగెత్తి వచ్చాడు.

''తాతయ్యా.. తాతయ్యా... మా మమ్మి, డాడి వచ్చారు... మా మమ్మి డాడి వచ్చారు... పెద్ద కారు లో వచ్చారు'' నోట మాట రానంత సం(భమంగా అన్నాడు. గౌరీపతిగారు తెల్లబోయారు. ఏం కొంప మునిగిందోనన్నట్టు మడికట్టుకుని వంట చేస్తున్న పా ర్వతమ్మ లోపల్నించి వచ్చింది ''మమ్మి డాడి రావడం ఏమిటిరా ఎక్కడనించి వచ్చారు....'' నవ్వుతూ అ న్నారు నమ్మకం లేక.

''నిజం తాతయ్యా... పెద్దకారు ఆగింది చూడు కావలిస్తే, అదిగో చూడు మా మమ్మియే, మా డాడి కూడా వస్తున్నారు లోపలికి కావలిస్తే చూడు..'' మనవడు చూపించినవైపు చూశారు గౌరీపతిగారు. గేట్లోంచి వస్తున్న జంటని చూసి, సరిగా చూపు ఆనక కళ్ళజోడు పెట్టుకుని చూశారు. కోడలు అరుణ, పక్కనో యువకుడు. ఇద్దరూ లోపలికి వచ్చారు. ఆ యన రెప్పవాల్చడం మర్చిపోయి ది(గ్భాంతిగా అరుణ వంక చూస్తూండిపోయారు. పార్వతమ్మ అయితే క ళ్ళు, నోరు తెరుచుకుని నిలబడి పోయింది. వాళ్ళిద్ద రూ వస్తూనే గౌరీపతిగారికి వంగి దండం పెట్టారు. పార్వతమ్మ దగ్గరకి వెళ్ళినమస్కారం పెట్టారు. ''అత్త య్యా! ...... ఏమిటలా చూస్తున్నారు? మర్చిపోయారా నన్ను.... మామయ్యా! అరుణని..''

అంది ఆ అమ్మాయి. ఇదివరకు కంటే కొంత వళ్ళు వచ్చి రంగుదేలి, ఖరీదైన దుస్తులతో వున్న అరుణలో మార్పు వచ్చినా గుర్తుపట్టనంత రాలేదు. 'మామ య్యా.... వీరు (పభాకర్, మావారు....'' పక్కను న్న అతన్ని పరిచయం చేసింది. అప్పటికి తేరుకుని తడబడ్తూ లేచి నిలబడి..... ''ఆ....ఆ..... ఏమిటో ఇలా ఇన్నాళ్ళ తరువాత నిన్ను చూస్తే..... నమ్మ లేక పోయాను. రండి.. రండి.......లోపలికి.. అలా కూ ర్చోండి. ఏమిటే... అలా తెల్లబోతావు'' భార్య వె(రి దానిలా చూడటం గమనించి హెచ్చరించినట్టన్నారు గౌరీపతిగారు. ''ఎన్నాళ్ళకీ.... ఎన్నాళ్లయిందమ్మా నిన్ను చూసి, మళ్ళీ జన్మలో చూస్తాననుకోలేదు....'' పార్వతమ్మ గాద్గదికంగా అంది. అరుణ తలదించుకు ని ''క్షమించండి అత్తయ్యా! ఎలా రావాలో, ఏమొహం పెట్టుకురావాలో అర్థం కాక యిన్నాళ్ళు రాలేకపోయా ను.....'' అంటూ కుతూహలంగా, సిగ్గు సిగ్గుగా చూ స్తున్న రవిని చూసి 'వీడు... ఈ బాబు..' అంటూ ఆగిపోయింది రవివంక.

''అవునమ్మా రవి,.... రవి(పసాద్.... ఎంతవా డయ్యాడో చూడు'' గౌరీపతిగారు మనవడిని దగ్గరకు లాక్కుని జుట్టు నిమిరారు (పేమగా.

''రవి (పసాద్ అని పేరు పెట్టారా? రవీ..'' గొణుక్కున్నట్టు అనుకుని 'రవీ.... ఇలా రా.... చూ డు నీకోసం బొమ్మలు, పుస్తకాలు, చాక్‌లెట్లు తెచ్చా ను. చూడు ఇవన్నీ నీకే మరి నాదగ్గరకి వస్తే ఇస్తాను' వెంట తెచ్చిన పెద్ద ప్లాస్టిక్ సంచులని చూపిస్తూ అంది. 'చూశారాండి. బాబు అప్పుడే ఎంత పెద్దవాడయ్యా డో.... రవీ, రా ఇలారా...' మళ్ళీ పిలిచింది. రవి నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తూ అరుణ దగ్గరకి సిగ్గుగా వెళ్ళాడు. చటుక్కున అరుణ రవిని దగ్గరికి లాక్కుని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది ఉద్వేగంగా. 'నీవు మా మమ్మివే కదూ......' రవి తల్లినిచూస్తూ అడిగాడు కొత్త లేనట్టు అరుణ ఆశ్చర్యంగా 'నీకెలా తెలుసు. ఎవరు చెప్పారు' 'నీ ఫోటో చూశాను. తాత య్య చెప్పారుగా' అన్నాడు పెద్ద పెద్దకళ్ళు తిప్పుతూ. అరుణ నమ్మలేనట్టుగా గౌరీపతి గారివంక (పశ్నార్థకం గా చూసింది. ఆయన తల పంకించి 'మా అమ్మ డాడి ఏరి, స్కూల్లో పిల్లలందరికీ వున్నారంటూ ఒక రోజు అడుగుతూంటే ఫోటోలు చూపించాను'

''మరి ఆ ఫోటోలో డాడిలా లేరే ఈ డాడి...'' సందిగ్ధంగా అడిగాడు రవి. అరుణ ఏదో చెప్పబోయే లోగానే గౌరీపతి వారిస్తున్న కళ్ళతో చూసి 'అది చాలా పాతఫోటో కద బాబూ... ఇప్పుడు మీ డాడి కొంత లావ య్యారు...అపుడు మీసం లేదు. ఇప్పుడు పెట్టుకు న్నారు. అంతే'' (పభాకర్ గౌరిపతి గారివంక (పశంస గా, కృతజ్ఞతగా చూశాడు.

''మమ్మి! మరి నన్ను ఇన్నాళ్లూ తీసి కెళ్ళలేదు. ఇప్పుడు తీసి కెళతావా నీతో'' అని అడిగాడు. అరుణ అర్థం కానట్టు చూసింది. గౌరిపతిగారు నెమ్మదిగా తరువాత చెప్తాను అన్నట్టు సౌంజ్ఞ చేసి రవీ ఆ బొమ్మల న్నీ నీకే ఆ సంచిల్లో తీసి కెళ్ళి చూడుమరి. ని(ఫెండ్స్ అందరికి చూపించు మరి...'' గౌరిపతిగారు అన్నా రు.

''తీసి కెళ్లనా మమ్మీ'' ఆనందంగా ఆ సంచులు పుచ్చుకు వరండాలోకి పరుగెత్తాడు.

మనవడిని బయటికి పంపించాక అరుణకి వాడి మాటలకర్థం విశదీకరించారు. వాడు అడిగినపుడు మనవడి మనసు కష్ట పెట్టడం ఇష్టంలేక తను ఆడిన అబద్దాలు చెప్పారాయన. అన్నీవిని అరుణ దోషిలా తలదించుకుంది. తలదించుకునే ఆమె ఈ ఆరేళ్ళ లో జరిగిందంతా టూకీగా చెప్పుకొచ్చింది. భర్తపో యాక అదోరకం షాక్‌లోలా కొన్నాళ్ళు అసలు జరిగిన నష్టం ఆమెకి తెలియలేదు. తాను కోల్పోయింది కొద్ది కొద్దిగా అర్థం అయ్యే వేళకి నెలలు నిండుతూండడం, ఇంట్లో తల్లిదం(డి తనని ఈ బిడ్డ తనకి ఎలా భవిష్య త్తులో అడ్డం ఎలా అవుతాడో, పట్టుమని ఇరవై ఏళ్ళులేని తనకి బోలెడు భవిష్యత్తుందని, భర్తపోయా డని దిగులుతో జీవచ్ఛవంలా బతకక్కరలేదని అందం, చదువు, డబ్బున్న తనని ఎవరో ఒకరు పెళ్లాడు తారని, పెళ్ళి అయ్యేవరకు చదువుకుంటూ, ఉద్యోగం చేసుకుంటూ ఉండవచ్చని, ఈ బిడ్డ ఉంటే ఏ మగాడు పెళ్ళికి ముందుకు రాడని, పెళ్ళికాకుండా



పసిబిడ్డని పెట్టుకుని ఇంకో ఏభై అరవై ఏళ్ళు అన్ని కోరికలు చంపుకుని బతకడం కష్టమని రకరకాలుగా భవిష్యత్తుని చీకటిగా చిత్రీకరించి ఆమెని మెంటల్‌గా ప్రిపేర్ చేశారు. బిడ్డని కళ్ళలో చూస్తే మమకారం పుట్టుకొస్తుందని, కొన్ని రోజులుంచుకుంటే ఎటాచ్‌మెంట్ పెరుగుతుందని, ఇంతకీ బిడ్డని ఏ అనాథాశ్రమంలోనో పడేయడం లేదుకదా, తాత, నాయనమ్మల దగ్గిర ముద్దుగా పెరుగుతాడని ఆ విషయంలో బెంగ అనవసరం అని, అసలు వారి దుఃఖం చూడలేక వారికోరిక కాదనలేక దీనికి వప్పుకున్నాం అని, బిడ్డని కని వారికప్పగించి ఆ అధ్యాయానికి ముగింపు చెప్పి కొత్త జీవితం ప్రారంభించాలని రకరకాలుగా నచ్చచెప్పి మెంటల్‌గా ప్రిపేర్ చేశారు. బిడ్డని అప్పగించాక కళ్ళారాచూడని బిడ్డకోసం కడుపులో పేగు కదిలేది. ఎలా ఉన్నాడో చూడాల్సింది అనిపించేది. ఒకసారి చూస్తే... అన్నకోరిక కలిగేది. అమ్మ, నాన్న ఓదార్పులతో ప్రేమాభిమానాల మధ్య గతం అంతా ఒక పీడకల అన్నట్టుమర్చిపోడానికి ప్రయత్నిస్తూ, కాలేజిలో చేరింది. ఎమ్మే పూర్తి చేసి ఏదో ఉద్యోగంలో చేరదాం అనుకునేలోపలే తల్లిదండ్రి పెళ్ళి ప్రయత్నాలు ఆరంభించారు. పేపరులో వేశారు. వచ్చిన దరఖాస్తుల్లో ప్రభాకర్ నచ్చాడు. ప్రభాకర్ విశాల హృదయం చూపెట్టి తనని చేపట్టడానికి వచ్చినందుకు, ప్రభాకర్‌లాంటి విద్యాధికుడు ఉన్నతోద్యోగి ఓ రెండో పెళ్ళి చేసుకునేందుకు వచ్చిన అతని సహృదయానికి తమ తల్లిదండ్రులు తమ అదృష్టం అని పొంగిపోయారు. నాలుగేళ్ళ క్రితం పెళ్ళయింది. ఏడాది, రెండేళ్ళు గడిచినా బిడ్డలు కలగలేదు. ప్రభాకర్‌కి చంటిపిల్లలంటే ఎంతో ప్రేమ. బిడ్డలు కావాలని తహతహలాడాడు. మూడేళ్ళు గడిచినా గర్భందాల్చకపోవడంతో అనుమానం వచ్చి ఇద్దరూ అన్ని రకాల పరీక్షలు చేయించుకున్నారు. రిపోర్టులలో ప్రభాకర్ స్పెర్మ్ కౌంట్ తక్కువని తేలింది. పిల్లలు కలిగే అవకాశం చాలా తక్కువ అన్నారు. మందులిచ్చారు. ఫలితం కన్పించలేదు. ప్రభాకర్ పిల్లలకోసం కలవరించసాగాడు. ఆఖరికి అనాథాశ్రమం నుంచి తెచ్చి పెంచుకోవాలని నిర్ణయించాడు!.. పిల్లలు కలగరని తేలిపోయిందగ్గరనుంచి ప్రభాకర్ బిడ్డని పెంచుకోవాలని నిర్ణయించిన దగ్గరనుంచి అరుణ తనకి బిడ్డవున్న సంగతి చెప్పాలని ఆరాటపడింది. ఇన్నాళ్ళు దాచి ఇప్పుడీ విషయం ఎలా చెప్పడం, చెపితే ప్రభాకర్ ఎలా తీసుకుంటాడోనని సతమతమయింది. తన కన్నబిడ్డ ఉండగా ఎవరో అనాధని ఎందుకు పెంచుకోవడం అని ధైర్యం చేసి ఉన్న సంగతి చెప్పి క్షమాపణ కోరింది. మొదట్లో ఆ సంగతి ఇన్నాళ్ళు దాచినందుకు హర్ట్ అయినా అరుణ బిడ్డని తన బిడ్డగా అంగీకరించాడు.

సంతోషంగా వింటున్న గౌరిపతి, పార్వతమ్మల మొహాలు పాలిపోయాయి. ఒకరి మొహం వంక వకరు ఆదుర్దాగా చూసుకున్నారు. వారి కళ్ళల్లో అలజడి, గుండెల్లో అదురు. వణికిపోయారు ఇద్దరూ. "ఇలా అడగడం అన్యాయం అని మాకు తెలుసు సార్. కానీ బిడ్డలు లేని మాకు అరుణ బిడ్డని అప్పగించగలిగితే మా వంటి అదృష్టవంతులు లేరనుకుంటాం. ఇది మీకు చాలా బాధాకరమైన విషయం అని తెలుసు. ఇలా అడగడం అనుచితం అనీ తెలుసు. ఎన్ని రోజులో ఆలోచించి ఆఖరికి అడగాలని, మీరంగీకరిస్తే తీసుకువెడదామని వచ్చాం." ప్రభాకర్ నెమ్మదిగా అన్నాడు

అరుణ ఆదుర్దాగా చూసింది.

"వీల్లేదు. ఎంతమాత్రం వప్పుకోను. పార్వతమ్మ ఆవేశంగా అరిచింది" ఏడేళ్ళు ఏడు సంవత్సరాలు రాత్రింబగళ్ళు అనుక్షణం కంటికి రెప్పలా పెంచాం మా ప్రాణంవాడు. వాడ్ని ఎంత మాత్రం ఇవ్వం. ఇన్నాళ్ళు కన్నతల్లి అయి ఉండీ ఒక్కసారి ఒక్కసారైనా బిడ్డ ఎలా ఉన్నాడోనని వచ్చి చూసిందా.. ఇప్పుడు పిల్లలు పుట్టలేదని వచ్చింది. మీకే పుట్టివుంటే ఈ రోజు వచ్చేదా. వాడ్నలా పుట్టగానే వదిలించుకుని ఇపుడు ఏ మొహంతో వచ్చింది..."

పార్వతమ్మ ఉక్రోషంగా అంది.

"పార్వతీ!" గౌరీపతిగారు హెచ్చరిస్తున్నట్టు అన్నారు. అననీండి మామయ్యగారూ... ఆవిడ అన్న దాన్లో అబద్ధం ఏముంది. కన్నతల్లిని అన్న విషయమే మర్చిపోయిన నేను ఆ మాటలకి దోషిలా తలదించుకోడం కంటే ఏంజవాబివ్వలేను. అపుడు నాకేమిటో తెలిసీ తెలియని వయసు. మా అమ్మనాన్నల మాటల ప్రభావం నామీద ఉండేది. పెళ్లయి కాస్త రెండేళ్ళు గడిచాక కాని బిడ్డల విలువ తెలిసి రాలేదు. కన్నబిడ్డని దూరం చేసుకున్న బాధ అప్పటికి గాని అర్థంకాలేదు. అర్థం అయినా ప్రభాకర్‌కి చెప్పలేకపోయాను. ఇప్పుడు... నాకు నేను చేసిన నేరం, పాపం ఎంతటిదో అర్థం అయింది. మిమ్మల్ని అడిగే హక్కు నాకు లేదు. మీరు దయతల్చి ఇస్తేనే తీసుకెడతాను" కన్నీళ్లమధ్య అంది అరుణ.

"వాడ్ని నీకిచ్చేసి మేమెలా బతకాలి. వాడు కాకపోతే మాకు ఇంక బతుకు ఏముంది అమ్మా" గౌరీపతిగారు అన్నారు. "నీ పరిస్థితీ అర్థం అవుతోంది... నీ పట్ల సానుభూతి.... "

"మమ్మీ.. మమ్మీ.... మనం మనవూరికి ఎప్పుడెళదాం..."అంటూ రవి పరిగెత్తివచ్చాడు.


"నాతో వస్తావా.. నాతో వచ్చి అక్కడ ఉంటావా ... అక్కడ స్కూల్లో చదువుతావా..." అరుణ వాడ్ని దగ్గరకి తీసుకుని అడిగింది.

"ఆఁ... సంబరంగా అన్నాడు. వాడి మొహంలో ఆనందం చూసి పార్వతమ్మ గౌరిపతిగార్ల మొహాలు మబ్బులు కమ్మినట్లయింది. "అక్కడ స్కూలు బాగుంటుందా మమ్మీ"

"స్కూలు బాగుంటుంది కానీ... మరి మామ్మని, తాతగార్ని వదిలి ఉండగలవా... మాతో వచ్చేస్తే తాత, మామ్మగారిని చూడాలని ఉండదా నీకు" ప్రభాకర్ అన్నాడు.


రవి ఆలోచనలో పడ్డాడు. కాస్త అయోమయంలో పడ్డట్టుచూశాడు. తరువాత ఒక నిమిషంఆలోచించి 'శలవుల్లో వస్తా తాతగారి దగ్గరికి. అనిత, విస్సు అందరూ శలవుల్లోనేగా తాతగారింటికి వెళ్ళేది" అని ఆ సమస్యకి జవాబు చెప్పేసి "ఏం తాతయ్యా శలవుల్లో వస్తే మనం ఆడుకుందాం... మామ్మా, నేను మమ్మీతో వెళ్ళి శలవుల్లో వస్తాను ఏం..." వాళ్ళని వప్పించడానికి అడిగినట్టున్నాడు. గౌరీపతి, పార్వతమ్మగార్లు మొహాలు చూసుకున్నారు. 'రవీ. గాద్గదికంగా అంది పార్వతమ్మ. "ఏరా నీకు మీ మమ్మీ దగ్గిరకే వెళ్ళిపోవాలని ఉందా. మా దగ్గరుండాలని లేదూ" మనవడిని దగ్గరకి లాక్కుని అడిగిందావిడ. రవి పెద్ద అవస్థలో పడ్డాడు. మామ్మ, తాతయ్యల మొహాలు చూసి "మీరేగదా చెప్పారు. ఓ రోజు మీ మమ్మీ డాడీ వచ్చి తీసికెడతారని... శలవులకి వస్తాగా"

"తాతయ్యని, మామ్మని మనతో తీసికెళ్ళిపోదాం రవీ. అలా అయితే ఏ గొడవా ఉండదు" ప్రభాకర్ అన్నాడు...'ఆ... అలాగే... తాతయ్య మాతో రావూ" ... అప్పుడే తన ప్రయాణం నిర్ణయించేసుకుని తమని రమ్మని పిలుస్తున్న మనవడిని చూసి వాళ్ళకింకేం



మాట్లాడాలో అర్థంకాలేదు.

"మీరు మాతో వచ్చి ఉంటే మాకంటే సంతోషించేవారుండరు. మీరు వస్తే ఏ సమస్యా ఉండదు. తొందరలేదు ఆలోచించండి.మేం ఎలాగో ఈరోజంతా ఉంటాం." అరుణ ఏదో చెప్పబోతుంటే గౌరీపతిగారు తలఅడ్డంగా ఆడించారు "ఆ ప్రసక్తి వద్దమ్మా... ముందు మీరు భోజనం అదీ చెయ్యండి... తరువాత మాట్లాడుదాం" మనవడి ముందు మాట్లాడడం ఇష్టంలేక మాట తుంచేశారు గౌరీపతిగారు.




ఆ రాత్రి పార్వతమ్మ భర్తని ఆవేశంతో దులిపేసింది. దుమ్మెత్తిపోసింది. ఏడ్చింది. "ఇన్నాళ్ళుపెంచి, కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపాడింది వీళ్ళకప్పగించడానికా— నేను వప్పుకోను. వప్పుకోను అని ఏడ్చింది. "మీరే అనవసరంగా వాడికి మీ మమ్మి డాడీలు వచ్చి తీసుకెడతారని చెప్పారు. లేకపోతే వాడు వెడతాననే వాడు కాదు. ఇంత కష్టపడి మన వంశాంకురం అని పెంచుకుని వాళ్ళకియ్యమని ఎలా చెపుతున్నారండి... వాడ్ని విడిచి ఎలా ఉండాలండీ. ఇవ్వలేం అని చెప్పేయండి. రవిదేం ఉంది. రెండురోజుల్లో మర్చిపోతాడు. వాడికి నేను నిజం చెప్పేస్తాను. అప్పుడింక వెడతానన డు"

"పార్వతి, నీకేనా బాధ నాకు లేదా! ఆ రోజు వాడ్ని సముదాయించడానికి అన్నమాట ఇలా మనకే ఉచ్చు బిగిస్తుందనుకోలేదు. పార్వతీ వాడు చూడు తల్లిదండ్రి దగ్గరకి వెళ్ళాలని ఎంత సంబరపడ్తున్నాడో! వాడే కనక ఇష్టపడకపోతే బలవంతంగా పంపడానికి ఎంత మాత్రం వప్పుకునేవాడిని కాను. ఆ పసివాడికి తల్లిదండ్రుల దగ్గర ఉండాలని ఉందే అందరి పిల్లల్లాగా. వాడ్ని మనం ఎలా సముదాయిస్తాం ఏమని నచ్చచెపుతాం. పంపించలేదని మనమీద వాడు కోపం పెంచుకుంటే తన మమ్మీ డాడీల నుంచి మనం దూరం చేస్తున్నామన్న భావం వాడికి కలిగితే వాడి దృష్టిలో మనం దోషులమయ్యాక ఇంకెందుకే మన బతుకు! పార్వతీ అరుణ సంగతి స్త్రీగా ఒక్కసారి ఆలోచించు. మాతృత్వపు మమతలు ఎలాంటివో తెలియని ఆ అమ్మాయికి తన బిడ్డకావాలంటున్నా ఆమెకి బిడ్డని దూరం చెయ్యడం న్యాయమేనా! మరో బిడ్డకి తల్లి అవలేని ఆ పిల్లకి బిడ్డ ఉండీ వాడ్ని దూరం చేయడం సబబేనా, తల్లిగా ఆమెకి అన్ని హక్కులూ ఉన్నాయి. ఆమె గట్టిగా అడిగితే కాదనే హక్కు మనకి ఎలా ఉంది! ఆ అమ్మాయి హక్కు అని నిలదీయడంలేదే. పుత్రభిక్ష పెట్టమని అర్థిస్తోంది. పార్వతీ మనం ఇంకో సంగతి ఆలోచించాలి. మన తర్వాత వాడి గతి ఏమిటని ఇన్నాళ్ళు దిగులుపడ్తున్నాం. ఇప్పుడీదేముడే ఈ సమస్యకి పరిష్కారం ఇదిగో అన్నట్టు వీళ్ళని పంపినపుడు ఈ అవకాశం వదులుకుంటే మన తర్వాత వాడిగతి ఏమిటి! నిజమే వాడ్ని వదలి మనం బతకలేం! మన బతుకులు చీకటయిపోతుంది కాని మన స్వార్థం కంటే వాడి బాగుకోరే వాళ్లంగా వాడి భవిష్యత్తు ముఖ్యం మనకు. మనకంటే ఇంకా బాగా పెంచుతారు.ఇంకా మరీ మంచి స్కూలు, మంచి బట్టలు, మంచి భవిష్యత్తు ఇస్తారు. పార్వతీ తల్లిదండ్రి మధ్య పెరగాలన్న వాడి కోరిక కాదనీ, ఆ ఆనందాన్ని వాడికందనీయి. "ఆ అబ్బాయి వీడికి తండ్రెలా అవుతాడండీ. కన్న కొడుకా ఏమిటి రేపు వీడ్ని సరిగా చూస్తాడని ఏముంది..." ఉక్రోషంగా అంది.

"అతను మంచివాడిలాగే ఉన్నాడు. అతనికి తన బిడ్డలంటూ లేరు కనుక వీడ్ని బాగానే చూసుకోవచ్చు. అయినా కన్నతల్లి ఉండగా వాడికేం లోటు జరుగుతుంది. పార్వతీ, రేపు వీడే కాలేజీలోనో చదవాలంటే మనల్ని వదిలివెళ్ళడూ... అలాగే అనుకుందాం ఇప్పుడూనూ.." అవిడకి నచ్చచెప్పబోయాడు.

"రెక్కలొచ్చిన పక్షులు గూడు వదిలివెళ్ళడం సహజం. రెక్కలే రాని పసికూనండీ... తెలియక ఎగరాలని ప్రయత్నిస్తుంటే హెచ్చరించడం మన బాధ్యత కదా..."

"రెక్కలు రాని పక్షే కాని ఈ గూడు వదిలి ఇంకో గూటికి వెడుతున్నాడు. ఇంకా సుఖంగా ఉండే గూడు దొరుకుతుంటే వాడ్ని బంధించి ఉంచాలనుకోడం మన స్వార్థం పార్వతీ, అర్థం చేసుకో, వాడ్ని వదిలి నేను మాత్రం బతకగలనా... నరకమే మనకు వాడు లేని బతుకు. కానీ ఇది తప్పదని మనం అర్థం చేసుకోవాలి..." అయన రాత్రంతా భార్యక్తి నచ్చచెప్తూ, సముదాయిస్తూ ఏడుస్తున్న ఆవిడని ఓదారుస్తూ తెల్లారేసరికి ఆవిడ్ని మెంటల్‌గా ప్రిపేర్ చేశారు.

* * *

గత మూడు రోజులుగా ఆ ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది. ఆనాడు కన్నబిడ్డని పోగొట్టుకున్న దుఃఖం కంటే ఈనాడు మనవడు దూరం అయిన దుఃఖం భరించరానిదిగా ఉంది వారికి. పార్వతమ్మ రెండు రోజులు అన్నం ముట్టలేదు. గౌరీపతి గారు పడుకున్న పడక కుర్చీ వదలలేదు. మనవడు వెళ్ళిపోయిన దుఃఖం కంటే ఆ మనవడు అంత సంతోషంగా ఎన్నడూ మొహం కూడా చూడని వారి వెంట తమని వదిలి వెళ్ళిపోవడం వారికి కోతగా ఉంది. సంతోషంగా టాటాలు చెపుతూ వెళ్ళిపోతున్న ఆ మనవడి సంతోషం వారికేం సంతోషం కల్గించకపోగా మరింత దుఃఖాన్నిచ్చింది.

కాలం ఎలాంటి గాయాలయినా మాన్పుతుంది. వారం రోజులు గడిచే సరికి ఆ దుఃఖపు ఉద్వేగం కాస్త ఉపశమించింది, యాంత్రికంగా ఇంట్లో పనులు చేసుకోసాగింది పార్వతమ్మ. ఇద్దరి మొహాలలో కళాకాంతులు లోపించినా తప్పదన్నట్టు ఇంట్లో తిరగడానికి అలవాటు పడ్డారు.

ఆ రోజు మధ్యాహ్నం నిద్దట్లో చప్పుడికి ఉలికి పడి లేచింది పార్వతమ్మ అలవాటు ప్రకారం. "ఓరి మీ అమ్మకడుపులు కాలా... ఆ మిగిలిన రెండు కాయలన్నా దక్కనివ్వండ్రా, పోతారా పోరా వెధవల్లారా" అంటూ మామిడి చెట్లదగ్గరకి వెళ్ళిందావిడ. వెళ్ళాక గాని ఆవిడకి గుర్తుకు రాలేదు. ఇంక ఈ చెట్ల పళ్ళు తినడానికి ఎవరూ లేరు. ఉండరు అన్నది తట్టింది. ఏరికో విత్తువేసింది ఒకరు అనుభవించేది ఒకరంటారు. తాతలు నాటిన చెట్ల ఫలాలు మనవలు తింటారు. తమకింకెవరున్నారు తినడానికి అనుకోగానే ఆవిడ భోరున ఏడుస్తూ చెట్టకింద కూలబడింది. పిల్లలందర్నీ మీ అమ్మకడుపులు కాలా అని తిట్టేదాన్ని అందుకే ఆ భగవంతుడు రెండు సార్లు నా కడుపుమీద దెబ్బకొట్టాడు" అనుకుంటూ ఏడవసాగింది. భార్య ఏడుపు విని గాభరాగా బయటికి వచ్చిన గౌరీపతిగారు ఆవిడ ఏడుపుకి కారణం తెలుసుకుని వేదాంతిలా ఓ నవ్వు నవ్వారు. భార్యతలమీద చెయ్యివేసి ప్రేమగా తలనిమురుతూ చెట్టుపైకి చూశారు. చెట్టుమీద ఉండే కాకిగూడు ఖాళీగా ఉంది. చిటారు కొమ్మల మధ్య దాక్కుని ఉన్న రెండు మామిడి పళ్ళు పిల్లలకి అందకుండా మిగిలిన ఆ రెండు పళ్ళు బంగారు రంగులో మెరిసిపోతూ రేపో మాపో రాలడానికి సిద్ధంగా ఉన్నవి కన్పించాయి.

○